క్లుప్తంగా...

'అంబేడ్కర్ ఫొటో'పై పార్లమెంట్‌లో చర్చిస్తా

వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



ఉస్మానియా యూనివర్సిటీ: ఇండియన్ కరెన్సీపై డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ ఫొటో కోసం పార్లమెంట్‌లో చర్చలేవనెత్తుతానని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ బొమ్మ సాధన సమితి జాతీయ అధ్యక్షులు పరుశురాం ఆధ్వర్యంలో పల్లె నుంచి ఢిల్లీ వరకు కొనసాగుతున్న యాత్ర గురువారం ఓయూ న్యాయకళాశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఆయన కళాశాల ఎదుట గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించి యాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బీఆర్. అంబేడ్కర్ దేశ చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచేలా ఆయన ఫొటో భారత దేశ కరెన్సీపై ముద్రించాలన్నారు. ఓయూ లా డీన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్, జేబీరాజు, గుజ్జకృష్ణ, రామకృష్ణ, బీఆర్ఎస్వీ నాయకులు హరిబాబు, రుద్రవరం లింగస్వామి పాల్గొన్నారు.

పీజీ-సీయూ సెట్‌కు ఉచిత శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలకు నిర్వహించే పీజీ-సీయూసెట్-23 ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. హెచ్‌సీయూ వెనుక శేరిలింగపల్లి సమీపంలోని పూలే-అంబేడ్కర్ సెంటర్ ఫర్ ఫిలాసఫికల్ అండ్ ఇంగ్లిష్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఎంఏ పొలిటికల్ సైన్స్,ఎంఏ ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ప్రవేశాలకు నెల రోజుల శిక్షణ, ఉచిత హాస్టల్ వసతి, భోజనంతో పాటు మెటీరియల్ అందచేయనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ బాలబోయిన సుదర్శన్ తెలిపారు. మరిన్ని వివరాలకు 6309316222 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేటి యువతకు సంత్‌గాడ్గేబాబా ఆదర్శం

చిలకలగూడ: స్వచ్ఛభారత్ సృష్టికర్త సంత్‌గాడ్గే బాబాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రజక మహిళ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు రాజేశ్వరి సూచించారు. తెలంగాణ రాష్ట్ర రజక మహిళ సంఘం ఆధ్వర్యంలో గురువారం మెట్టుగూడ చౌరస్తాలో సంత్‌గాడ్గేబాబా 147వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సామాజిక రుగ్మతలపై పోరాడిన యోధుడు సంత్‌బాబాగా అభివర్ణించారు. తెలంగాణ రజక ధోబీ అభివృద్ధి సంస్థ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మందవలపు గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై సంత్‌బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తనిఖీలు టైట్.. మత్తు పదార్థాలు ఔట్



- సత్ఫలితాలిస్తున్న 'గాంధీ' సెక్యూరిటీ వ్యవస్థ
- దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు
- మరింత బలోపేతానికి అధికారుల ప్రణాళిక
- హర్షం వ్యక్తం చేస్తున్న రోగుల సహాయకులు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సెక్యూరిటీ వ్యవస్థలో నూతనంగా ప్రవేశపెట్టిన నియమ నిబంధనలు, ప్రత్యేక కార్యాచరణ మార్గదర్శకాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఆస్పత్రి ప్రవేశ మార్గాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టడంతో చుట్టా, బీడీ, సిగరెట్, గుట్కా, తంబాకు, పాన్, మద్యం, కల్లు వంటి మత్తు పదార్థాలతో ఆయా వార్డుల్లోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో పరిశుభ్రతతో పాటు మత్తులో చేసే గొడవలు గణనీయంగా తగ్గాయి. సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, ఆర్ఎంఓ-1 జయకృష్ణ, సెక్యూరిటీ వింగ్ ఆర్ఎంఓ రాముల నేతృత్వంలో సెక్యూరిటీ వ్యవస్థను మరింత పటిష్ట పరిచేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. మూడు షిఫ్టుల్లో 196 మంది సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహిస్తున్నారు. చిత్తశుద్ధి, అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న గార్డులను ప్రోత్సహిస్తూ, కాసుల కోసం కక్కుర్తి పడేవారిని గుర్తించి విధుల నుంచి తొలగిస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలు

ఇలా చేస్తున్నారు.

- నొయిడాకు చెందిన జీడీఎక్స్ సంస్థ గాంధీఆస్పత్రిలో సెక్యూరిటీ, శానిటేషన్ టెండర్లను దక్కించుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సెక్యూరిటీ గార్డులు, శానిటేషన్, పేషెంట్ కేర్ వర్కర్ల సంఖ్యను రెట్టింపు చేసింది.
- ఆస్పత్రిలోని ఆయా విభాగాలు, వార్డుల్లోనే రోగులు, రోగి సహాయకులతో పాటు గుర్తుతెలియని వ్యక్తులు యథేచ్ఛగా మత్తు పదార్థాలను సేవించడాన్ని గాంధీ పాలన యంత్రాంగం గుర్తించి వీటి నివారణ, నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది.
- ఆస్పత్రి సెల్లార్ నుంచి వార్డులు, విభాగాల్లోకి వెళ్లేందుకు ఏడు మార్గాలు ఉండగా, ఐదింటిని తాత్కాలికంగా మూసివేశారు. మిగిలిన ర్యాంపు, మెట్ల మార్గాల్లో గార్డులను ఏర్పాటు చేయడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట పడింది.
- ఆస్పత్రి ప్రధాన భవనంలోని ఇన్ పేషెంట్ విభాగాల్లోకి వెళ్లేందుకు ఉన్న మార్గాలను మూసి ప్రధాన ద్వారంతో పాటు లేబర్ రూమ్ మార్గాల్లో అనుమతిస్తున్నారు. ప్రధాన మార్గంలో వైద్యులు, పీజీలు, విద్యార్థులు, నర్సింగ్, మినిస్టీరియల్ స్టాఫ్‌తోపాటు వీఐపీలకు, లేబర్ వార్డు వద్ద చెక్‌పాయింట్ వద్ద తనిఖీలు చేసి లోపలికి అనుమతిస్తున్నారు.
- లేబర్‌వార్డు స్క్రీనింగ్ పాయింట్ వద్ద రోగులు, రోగి సహాయకులు, సందర్శకుల జేబులు, బ్యాగులు తనిఖీలు చేసి చుట్ట, బీడి, సిగరెట్, గుట్కా, కిళ్లీ, తంబాకు, పాన్‌మసాలా, కల్లు వంటి వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. స్వాధీనం చేసుకున్న వాటిని ఎప్పటికప్పుడు ఫొటోలు, వీడియోలు తీసి సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తున్నారు.
- రోగి సహాయకులకు ఇచ్చే గేట్ పాస్‌లను నకిలీవి సృష్టించి ఆస్పత్రి లోపలకు ప్రవేశించినట్లు గుర్తించి, వాటికి చెక్ పెట్టేందుకు పాస్‌లపై సీక్రెట్ కోడ్ నంబర్లు వేస్తున్నారు. గత రెండు రోజుల్లో పదుల సంఖ్యలో నకిలీ గేట్‌పాస్‌లను స్వాధీనం చేసుకోవడం గమనార్హం.
- అవుట్ పేషెంట్, అత్యవసర విభాగంతోపాటు ఆస్పత్రి ప్రాంగణంలో అంబులెన్స్‌లు, ఇతర వాహనాల రాకపోకలు ఎటువంటి ఇబ్బంది లేకుండా నో పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేయడంతో పార్కింగ్ సమస్య కొంతవరకు పరిష్కారమైంది.

వైద్యంతో పాటు భరోసా ఇచ్చేందుకు కృషి



రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు డబ్బులు, సెల్‌ఫోన్లు, ఆభరణాలు, వాహనాలు దొంగతనాలకు గురికాకుండా భరోసా అందించేందుకు కృషి చేస్తున్నాం. స్థానిక, స్పెషల్ పోలీసులు, జీడీఎక్స్ సంస్థ గార్డులతో కలిసి సెక్యూరిటీ వ్యవస్థను మరింత పటిష్ట పరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తాం.

–ప్రొఫెసర్ రాజారావు, గాంధీ సూపరింటెండెంట్

మరింత బలోపేతం చేస్తాం..



గతంతో పోలిస్తే ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో దొంగతనాలు గణనీయంగా తగ్గాయి. మత్తు పదార్థాలు ఆస్పత్రి లోపలకు చేరకుండా చెక్, స్క్రీనింగ్ పాయింట్లతో చెక్ పెట్టాం. ప్రతిరోజు రెండు బస్తాల మత్తు పదార్థాలతో పాటు ఆరు నుంచి పది లీటర్ల కల్లును స్వాధీనం చేసుకుంటున్నాం. అందరి సహాయ సహకారాలతో సెక్యూరిటీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

–డాక్టర్ రాము. సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ ఆర్ఎంఓ



పట్టుబడ్డ నకిలీ గేట్‌పాస్‌లు



ఇటీవల పట్టుబడ్డ కల్లు బాటిల్

బేగంపేట నాలా అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

అధికారులకు మంత్రి తలసాని ఆదేశం



పనులపై సూచనలు చేస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: బేగంపేట నాలా సమగ్ర అభివృద్ధి పనులను (ఎస్ఎన్‌డీపీ) ఏప్రిల్ చివరి వరకు పూర్తి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం కింద రూ.45 కోట్ల వ్యయంతో చేపట్టిన బేగంపేట నాలా అభివృద్ధి, నిర్మాణ పనులను గురువారం బేగంపేటలోని బ్రాహ్మణవాడీలో అధికారులతో కలిసి పరిశీలించారు. పూడిక తొలగింపు, తాత్కాలిక రోడ్డు నిర్మాణం తదితర పనులు నెమ్మదిగా సాగుతుండడం పట్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో నాలాకు ఎగువ నుంచి వచ్చే వరదనీరు సమీపంలోని వడ్డెరబస్తీ, ప్రకాష్‌నగర్, బ్రాహ్మణవాడీ, అల్లంతోటబావి తదితర కాలనీలు, ఇళ్లల్లోకి చేరి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ఈ సమస్యను దూరం చేయాలనే లక్ష్యంతో నాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా వరదనీరు రాకుండా నివారించేందుకు నాలాకు కుడి వైపున 634 మీటర్ల పొడవున రిటైనింగ్ వాల్‌ను నిర్మించి 660 మీటర్ల మేర ఉన్న రిటైనింగ్ వాల్ ఎత్తు పెంచడం జరిగిందని చెప్పారు. అదేవిధంగా ఎడమ వైపున 854 మీటర్ల మేర నూతన రిటైనింగ్ వాల్ నిర్మాణం, 386 మీటర్ల మేర ప్రస్తుతం ఉన్న రిటైనింగ్ వాల్ ఎత్తు పెంచి నిర్మించారన్నారు. పనులన్నీ సకాలంలో పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పనులన్నీ పూర్తయితే ఎన్నో సంవత్సరాల నుంచి ఆయా ప్రాంతాల ప్రజలు పడుతున్న వరద ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని చెప్పారు. మంత్రి వెంట కార్పొరేటర్ మహేశ్వరి, ఎస్ఎన్‌డీపీ ఈఎన్‌సీ జియావుద్దీన్, సీఈ కిషన్, వాటర్‌వర్క్స్ డైరెక్టర్ ఆపరేషన్స్ కృష్ణ, ఎస్ఎన్‌డీపీ ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ జీఎం రమణారెడ్డి, ఎలక్ట్రికల్ డీఈ సుధీర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్, నాయకులు శ్రీహరి, డీవీ నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్, నరేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్, సవరాలబస్తీ తదితర ప్రాంతాల్లో తాగునీరు లోప్రెషర్‌తో వస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని బీఆర్ఎస్ నాయకుడు పొగర్తి భువన్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులకోసారి సరఫరా చేసే మంచినీరు కేవలం రెండు బిందెలు మాత్రమే వస్తున్నాయని, జలమండలి అధికారులకు ఫిర్యాదు చేస్తే వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప సమస్య పరిష్కారం కాలేదన్నారు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో సమస్య మరింత తీవ్రతరం అవుతుందని, ఉన్నతాధికారులు స్పందించి నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్నారు.

చెక్కు అందజేత

లాలాపేట: పేద, మధ్య తరగతి ప్రజలు మెరుగైన వైద్యం పొందడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదపడుతుందని డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్ రెడ్డి అన్నారు. స్వరూపకు మంజూరైన రూ. 58 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం తార్నాకలోని ఆమె కార్యాలయంలో అందజేసి మాట్లాడారు.

సెమినార్ హాల్‌కు మరమ్మతులు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలోని న్యూసెమినార్ హాల్‌కు మరమ్మతులు చేసి ఆధునికీకరించాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ (విజృంభణ) నాయకులు కోరారు. గురువారం కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.గణేష్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు.

ఎన్నికల ప్రకటన రద్దు చేయాలి

వికాస్ మంచ్



లీగల్ నోటీసు ప్రతిని చూపిస్తున్న మంచ్ ప్రతినిధులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని రెండేళ్లుగా పోరాటం చేస్తున్నామని కానీ.. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ బోర్డు ఎన్నికలకు ప్రకటన జారీ చేయడం ఎంతవరకు సబబు అని కంటోన్మెంట్ వికాస్ మంచ్ అధ్యక్షులు ఏబెల్ ప్రశ్నించారు. మహేంద్రహిల్స్‌లోని మంచ్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విలీన అంశాన్ని పక్కన పెట్టి కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలకు ప్రకటన చేయడం కంటోన్మెంట్ ప్రజలను మోసగించినట్లేనని అన్నారు. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించిన ప్రకటనను రద్దు చేయాలని కోరుతూ లీగల్ నోటీసు జారీ చేశామన్నారు. ఎన్నికల ప్రకటన రద్దు చేయకుంటే న్యాయ పోరాటం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్, ప్రభుగుప్త, మహ్మద్ షఫీ, అంబాల శ్రీనివాస్, జమీల్, యాదగిరి, మురళి యాదవ్, బొట్టు నర్సింగ్‌రావు, శివ, మోహన్ పాల్గొన్నారు.

ఓయూలో పీహెచ్‌డీ పోరు



పోలీసులతో విద్యార్థుల వాగ్వాదం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ అభ్యర్థుల పోరు కొనసాగుతుంది. పీహెచ్‌డీ ఫలితాల అనంతరం ఐక్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అర్హత మార్కుల తగ్గింపు కోసం వీసీ ప్రొ.రవీందర్‌తో మాట్లాడేందుకు వెళ్లి ఆయన చాంబర్‌లో బైఠాయించి ఆందోళన చేసి అరెస్టయ్యారు. అప్పటి నుంచి వీసీని కలిసేందుకు గత నెల రోజులుగా పీహెచ్‌డీ అభ్యర్థులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. పది రోజుల జపాన్ పర్యటన ముగించుకొని ఓయూ విధులకు హాజరవుతున్న కలిసేందుకు తిరిగి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ వీసీ సమయం, అనుమతి ఇవ్వకపోవడంతో ఎక్కడికి వెళ్లినా విద్యార్థులు వెంబడిస్తున్నారు. ఇటీవల ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి హాజరు కాగా మాట్లాడేందుకు సమయం కేటాయించాలని విద్యార్థులు వీసీని అడ్డుకొని ఘెరావ్ చేయగా పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో బయటకు వెళ్లిపోయారు. గురువారం క్యాంపస్‌లోని న్యాయకళాశాల సందర్శించేందుకు వెళ్లిన వీసీని కలిసేందుకు విద్యార్థులు చేసిన ప్రయత్నం విఫలం కాగా అక్కడ నుంచి క్యాంపస్‌లోని సివిల్ సర్వీస్ శిక్షణ కేంద్రానికి వెళ్లారు. వీసీ లోపలికి ప్రవేశించగానే సెక్యూరిటీ సిబ్బంది తలుపులు మూసి బయటి నుంచి గడియపెట్టి విద్యార్థులు లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులతో తోపులాట, తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

సనత్‌నగర్: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన ఎస్ఆర్‌నగర్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం బోరబండ సైట్-3లో సుమారు 65 ఏళ్ల వృద్ధుడు అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి పరిశీలించగా చనిపోయినట్లు గుర్తించారు.

నిందితులను శిక్షించాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: వరంగల్ ఎంజీఎం డైరెక్టర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, పీజీ విద్యార్థిని ధారావత్ ప్రీతిని ర్యాగింగ్‌తో వేధించిన సీనియర్ విద్యార్థులను తొలగించాలని ఓయూలో లంబాడీ విద్యార్థులు డిమాండ్ చేశారు. గురువారం లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఎల్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షులు అశోక్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రీతిని వేధింపులకు గురిచేసి ఆత్మహత్యకు బాధ్యులైన సీనియర్ విద్యార్థులను డైరెక్టర్, ప్రిన్సిపల్ వెనకేసుకు రావడం సిగ్గుచేటన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సీసీఎంబీలో పూర్వ విద్యార్థుల సమావేశం

లాలాపేట: సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలుక్యూలర్ బయాలోజీ(సీసీఎంబీ)వ్యవస్థాపక డైరెక్టర్ పుష్ప మిత్ర భార్గవ జయంతి, వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సీసీఎంబీలో పీహెచ్‌డీ పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఆధునిక జీవశాస్త్రంలో దూరదృష్టి కల్గిన శాస్త్రవేత్త అని పీఎం భార్గవ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కణత్వచం ఫాబ్రిక్‌లాంటి స్వభావం దాని పొరను అర్థం చేసుకోవడానికి భౌతిక, జీవ శాస్త్రవేత్తలు ఏ విధంగా కలిసారు అనే అంశంపై నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్ ప్రొఫెసర్ సత్యజిత్ మేయర్ ఉపన్యాసం చేశారు. ఇలాంటి సమావేశాల ద్వారా ఫెలోషిప్‌లు, పరిశోధనలకు అవసరమైన ఫండింగ్ అవకాశాలు లభిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వినయ్ కె. నందుకూరి, పూర్వ విద్యార్థులు డా. కస్తూరి మిత్ర, డా. అనీష్‌కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సీఐ నరేష్

చిలకలగూడ : సైబర్ నేరగాళ్లు పెట్రేగిపోతున్న నేపథ్యంలో ప్రజలంతా మరింత అప్రమత్తంగా ఉండాలని చిలకలగూడ సీఐ నరేష్ కోరారు. ఠాణా పరిధిలో సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు పెరుగుతున్నాయని, కాలనీలు, అపార్ట్‌మెంట్లు, స్కూల్స్, కాలేజీలు, ఆలయాలు తదితర ప్రాంతాల వద్ద సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. పిన్ నంబరు, ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లోను ఎవరికీ చెప్పరాదన్నారు. బ్యాంకు, పోస్టాఫీస్, టెలీకాం, హెల్త్‌కేర్, ఇన్సూరెన్స్ ఇతర ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు ఎలాంటి ఫోన్లు చేయరని గుర్తించాలని, కేవైసీ అప్‌డేట్ పేరిట ఎక్కువ మోసాలు జరుగుతున్నాయన్నారు. ఇంటర్నెట్ ఆధారంగా జరిగే వ్యక్తిగత, ఆర్థిక, భద్రత పరమైన నేరాలను సైబర్ నేరాలుగా పరిగణిస్తారని వివరించారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు ఠాణా పరిధిలో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీఐ నరేష్ తెలిపారు.

దాసారం బస్తీలో చెత్త ఆటోల తరలింపు

సనత్‌నగర్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు దాసారం బస్తీలోని చెత్త ఆటోలను జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించారు. బస్తీలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారు ఆటోలలో చెత్తను సేకరించి అందులోని వస్తువులు, ఇతర పదార్థాలను గ్రేడింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలో చెత్త, ఇతర వ్యర్థాలు గాలికి దుర్వాసన వెదజల్లడం, కాలనీల్లోకి వస్తుందని ఇటీవల మంత్రి పర్యటనలో స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి వెంటనే చెత్త ఆటోలను అక్కడి నుంచి తొలగించి వేరే ప్రాంతంలో నిలిపేలా ప్రత్యామ్నాయ స్థలం చూపాలని ఆదేశించిన నేపథ్యంలో గురువారం పోలీసుల సహకారంతో జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ ప్రాంతంలో ఉన్న చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టి ఆటోలను మరో ప్రాంతానికి తరలించారు.

పార్క్ చేసిన రాయల్ ఇన్‌ఫీల్డ్ చోరీ

సనత్‌నగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎర్రగడ్డ బీ-శంకర్‌లాల్ నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయం సమీపంలో నివాసముంటున్న సుధాకర్ తన రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్ (టీఎస్ 09ఎఫ్ ఎక్స్ 4483)ను ఇంటి ముందు పార్క్ చేశాడు. గురువారం తెల్లవారుజామున ముఖానికి మాస్క్ ధరించి వచ్చిన దొంగ కాలితో హ్యాండిల్ విరగ్గొట్టి తోసుకుంటూ తీసుకెళ్లిన దృశ్యాలు సీసీ ఫుటేజీల్లో రికార్డు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయండి



సమావేశం అనంతరం అభివాదం చేస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఓయూ లైబ్రరీలోని ఐసీఎస్ఎస్ఆర్ హాల్లో జాతీయ గిరిజన విద్యార్థి సమాఖ్య (ఎన్‌టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఉషాకిరణ్, ప్రొ.కోదండరామ్, ఓయూ లా డీన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్, చనగాని దయాకర్‌గౌడ్ పాల్గొని ప్రసంగించారు. పోడుభూములతో పాటు గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రొ.మంగు, టీజేఎస్ రాష్ట్ర అధ్యాపకులు సర్దార్ వినోద్‌కుమార్, ఎన్‌టీఎస్ఎఫ్ నేత శ్రీను, మానవ హక్కుల సంఘం అధ్యక్షులు భుజంగరావు, ఆదివాసీ ఫోరం కన్వీనర్ రామకృష్ణదొర, గొండు రామదాసు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : బట్టి విక్రమార్క

రాంగోపాల్‌పేట్: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని, ప్రశ్నించే వారిపై దాడులు చేస్తున్నారని సీఎల్పీ నేత బట్టి విక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుల చేతిలో గాయపడి సికింద్రాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హన్మకొండకు చెందిన తోట పవన్‌ను బట్టి విక్రమార్క గురువారం పరామర్శించి వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు గూండాల మాదిరి వ్యవహరిస్తున్నారని ప్రశ్నించిన వారందరిపై ఇలా దాడులకు దిగబడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఇందులో ఎంత పెద్ద వ్యక్తులు ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్ల వంకాయ 13, పొడుగు వంకాయ 13, బెండకాయ 50, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 48, పచ్చకాకర 35, పందిరిబీర 50, క్యాబేజీ 10, క్యారెట్ 18, దొండ 23, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 35, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 28, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 16, చామగడ్డ 70, మొరంగడ్డ 18, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 18, మునగకాయ 4-6, ముల్లంగి 3-5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ప్రోటాన్ బీం థెరపీతో విజయవంతంగా చికిత్స

బంజారాహిల్స్: అపోలో ప్రోటాన్ కేన్సర్ సెంటర్ వైద్యులు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న 11 ఏళ్ల బాలికకు, స్కల్ బేస్ కార్డోమాతో బాధపడుతున్న 16 ఏళ్ల బాలికకు ప్రోటాన్ బీం థెరపీతో విజయవంతంగా చికిత్స నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అపోలో ప్రోటాన్ కేన్సర్ సెంటర్ చెన్నై రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ చిలుకూరి మాట్లాడుతూ, ప్రోటాన్ బీం థెరపీ అనేది ప్రపంచంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యంత అధునాతన రేడియేషన్ థెరపీ చికిత్స అని అన్నారు. ఈ థెరపీ ద్వారా రోగులకు తాము విజయవంతంగా వైద్యసేవలు అందించామన్నారు.

'నా మాటల మూట' ఆవిష్కరణ

పంజగుట్ట: ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు ఉప్పల గోపాలరావు (ఉగోరా) రచించిన 'నా మాటల మూట' 'ఉగోరా రచనలపై వివిధ రంగాల్లోని ప్రముఖుల అభిప్రాయాలు' అనే పుస్తకాల ఆవిష్కరణ గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఎన్‌టీవీ సీఈఓ రాజశేఖర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సీనియర్ పాత్రికేయులు దిలీప్ రెడ్డి, విద్యా వెంకట్, ప్రముఖ పద్య కవి డాక్టర్ రాధశ్రీ , సామాజిక కార్యకర్త రవీంద్ర, విశ్రాంత ప్రిన్సిపాల్ విజయగోపాల్, కథా రచయిత గొర్రెపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైలులో ఉత్తుత్తి బాంబు బెదిరింపులు

ఆటో డ్రైవర్ అరెస్ట్

రాంగోపాల్‌పేట్: రైలులో బాంబు ఉందని బెదిరింపులకు పాల్పడిన ఆటో డ్రైవర్‌ను గోపాలపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 22న సికింద్రాబాద్ నుంచి వెళ్లాల్సిన బెలగావి ఎక్స్‌ప్రెస్ రైలులో బాంబు ఉందని గుర్తుతెలియని వ్యక్తి కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడు. పోలీసుల తనిఖీల తర్వాత అది ఉత్తుత్తి బాంబు బెదిరింపులు అని తేలింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారించగా సంగారెడ్డి జిల్లా దేవరపల్లికి చెందిన బాలరాజ్ ఫోన్ చేసినట్లు గుర్తించారు. గురువారం అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ముగ్గురు వ్యక్తులు ఈ రైల్‌లో బాంబు ఉందని మాట్లాడుకుంటూ ఉండటంతో తాను ఫోన్ చేశానని సదరు వ్యక్తి పోలీసులకు వివరించారు. ఫోన్ చేసిన సమయంలో సదరు వ్యక్తి మద్యం తాగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

యువతకు క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రి అందజేస్తున్న జంపన ప్రతాప్

రసూల్‌పురా: యువత చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా తల్లిదండ్రులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందేలా చర్యలు తీసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. బోర్డు మూడవ వార్డు ఈద్గా అంబేడ్కర్‌నగర్‌లో గురువారం బస్తీలోని యువతకు వివిధ క్రీడ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలోని కమ్యూనిటీ హాల్ పక్కనున్న ఖాళీ స్థలంలో కొందరు మద్యం తాగి సీసాలను వేస్తున్నారని మహిళలు తన దృష్టికి తీసుకువచ్చారని, వారికిచ్చిన హామీ మేరకు సదరు స్థలంలో షటిల్, వాలీబాల్ కోర్టుల అభివృద్ధి, వీధీ దీపాలను ఏర్పాటు చేయించానన్నారు. అదే విధంగా యువతకు క్రీడా పరికరాలను అందజేశామన్నారు. బస్తీవాసులు ఐకమత్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని మద్యం తాగి ఇబ్బందులకు గురిచేసే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజుసింగ్, సూరజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.